

కలెక్టర్‌ను కలిసిన ఉప కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ఉప కలెక్టర్‌గా బదిలీ పై జిల్లాకు వచ్చిన వి.ఎస్. లోకేశ్వరరావు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసారు. గతంలో ప్రకాశం జిల్లా ఒంగోలులో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారిగా పని చేసిన లోకేస్వరరావు ఇటీవల జరిగిన బదిలీలలో జిల్లాకు బదిలీ అయ్యాయి. ప్రస్తుతం విశాఖపట్నంలో జరుగుతున్న జోనల్ స్థాయి విద్యాశాఖ సమావేశం, పాఠశాల విద్య బలోపేతంపై జరుగుతున్న వర్క్ షాప్ కు హాజరైన ఆయన కలెక్టర్ ను కలిసి పూల మొక్కను అందజేశారు.



పూల మొక్కను ఇస్తున్న ఉప కలెక్టర్



ఆందోళన చేపడుతున్న పిఎసిఎస్ ఉద్యోగులు

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని

పిఎసిఎస్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-పాడేరు:తమకు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా కలెక్టరేట్ వద్ద పిఎసిఎస్ ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల రాష్ట్ర యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల హెచ్‌ఆర్ పాలసీ అమలు తో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో దశలవారీ ఆందోళన చేపట్టిన సంగతి విధితమే. ఈ మేరకు సోమవారం అన్ని జిల్లా కేంద్రాల వద్ద నిర్వహించ తలపెట్టిన ఆందోళనలో భాగంగా ఈ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు నినాదాలు చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో భాగంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబినాకృష్ణ, చిన్నబ్బాయి, ఈశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ రాష్ట్ర సహకార బ్యాంక్ వద్ద ఈనెల 27న అన్ని జిల్లాల ఉద్యోగులతో మహా ధర్నా నిర్వహిస్తామని చెప్పారు అప్పటికీ ప్రభుత్వం స్పందించి పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించకుంటే ఫిబ్రవరి 10 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా నాయకులు చిన్నబ్బాయి ఈశ్వరరావు వివిధ మండలాల నుంచి పిఎసిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జిసిసి బంక్‌లో పెట్రోల్ కొరత

- ఇబ్బందులు పడిన వాహనదారులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని జిసిసి పెట్రోల్ బంక్‌లో సోమవారం పెట్రోల్ కొరత ఏర్పడడంతో పెట్రోల్ కోసం బంకుకి వచ్చిన వాహనదారులు పలు ఇబందులు పడ్డారు. బంక్‌లో పెట్రోల్ లేక పోవడంతో వివిధ కిరాణా షాపుల్లో బ్లాక్‌లో అధిక రేట్లతో విక్రయించి తప్పని పరిస్థితిల్లో అధిక రేట్లతో కొనుగోలు చేసి వాహనదారులు ప్రయాణం సాగించారు. ఈ బంక్ లో డుంబ్రిగుడ 18 పంచాయతీలతో పాటు హుకుంపేట, అనంతగిరి మండలాల పలు పంచాయితీల గ్రామాల నుంచి వాహనదారులు పెట్రోలు కోసం మస్తుంటారు. సోమవారం పెట్రోల్ కోసం బంక్‌లోకి వచ్చిన వాహనదారులకు పెట్రోల్ పోవడంతో ఇబ్బందులు పడ్డారు. మారుమూల ప్రాంతాల్లో పెట్రోల్ అధిక రేట్లతో విక్రయిస్తుండడంతో అక్కడ కొనుగోలు చేసుకోలేక, ఆ ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనదారులు ఎప్పటికప్పుడు స్థానిక పెట్రోల్ బంక్‌కి వచ్చి పెట్రోల్ వేయించుకొని వెళ ంటారు. ఇక్కడ పెట్రోల్ అందుబాటులో లేకపోవడంతో వచ్చిన వాహనదారులు నిరాశతో బయట షాపుల్లో బ్లాక్ మార్కెట్లో అధిక రేట్లలో కొనుగోలు చేసి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ బంక్‌లో పెట్రోల్, డీజిల్ నిరంతరం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న పెట్రోల్ బంక్



సీలేరులో దట్టంగా కురుస్తున్న పొగ మంచు

దట్టంగా పొగ మంచు

- చలి తీవ్రతకు ఇబ్బంది పడుతున్న గిరిజనం

ప్రజాశక్తి-సీలేరు : జీకే.వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో పొగ మంచు దట్టంగా కురుస్తోంది. రెండు మూడు రోజులు నుంచి సీలేరులో అర్ధరాత్రి దాటి తరువాత నుండి ఉదయం 7 గంటల వరకు మంచు అధికంగా కురుస్తూ సీలేరు, దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు, గాలికొండ పంచాయతీల పరిధిలోని గ్రామాలను మంచు తెరలు కప్పేస్తున్నాయి. అదే స్థాయిలో చలితీవ్రత పెరిగి గజగజ వణికిస్తోంది. మునుపటి కన్నా ప్రస్తుతం చలి, మంచు తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పగటి పూట కూడా చిరుగాలులు వీస్తుండడంతో ప్రజలు బయటకు వెళ్లడానికి సాహసించడం లేదు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గిరి పల్లెల్లో చలి తీవ్రతకు తాళలేక ప్రజలు ఉన్ని వస్త్రాలు ధరించి చలిమంట్లు కాగుతూ ఉపసమనం పొందుతున్నారు. మంచు చలి కారణంగా వృద్ధులు, చిన్నారులు తీవ్రతకు అవస్థలు గురవుతున్నారు.



శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సర్పంచ్ బొగ్గా రామారావు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని రేగులపాడు పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు సోమవారం స్థానిక సర్పంచ్ బొగ్గా రామారావు, వైస్ ఎంపిపి, స్థానిక ఎంపిటిసి కొమరం పెంటయ్య శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేగులపాడు పంచాయతీ బొజ్జరాయిగూడెం, గ్రామంలో నాలుగు గ్రావెల్ రోడ్లు, రేగులపాడులో ఒక కల్వర్ట్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా పనులను నాణ్యతతో చేపట్టి గడువులోగా పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బొగ్గా సుబ్బమ్మ, గడ్డెల భీమయ్య, రేగులపాడు పీసా ఉపాధ్యక్షులు గుండం బాబురావు, పీసా కార్యదర్శి పైదా రాజయ్య, సిపిఎం సీనియర్ నేత నానుపల్లి వెంకటేశ్వర్లు, తెలుగు దేశం నాయకులు సోడే మధుసూధన్, రేగులపాడు, బొజ్జరాయిగూడెం సిపిఎం శాఖ కార్యదర్శులు బొగ్గా బుచ్చయ్య, మోసం రామకృష్ణ, సిపిఎం సభ్యులు సోడే శంకురు, సోడే సుమన్, రవి, గుండం చంటి, సవలం ముత్తయ్య, టిడిపి సభ్యులు బొగ్గా ముత్తయ్య, సోడే వీరభద్రం, మోసం రాము, పెద్దారాపు సతీష్, మడకం రమేష్, సోడే శ్రీరాములు, రేగులపాడు, బొజ్జరాయిగూడెం గ్రామాల పెద్దలు బొగ్గా దేవయ్య, బంటు లక్ష్మయ్య, సోడే సాధి, బొగ్గా పొద్దయ్య, బొగ్గా రాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా వికలాంగ పింఛన్ల ధ్రువీకరణ

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా వ్యాప్తంగా వికలాంగ పెన్షనర్ల వైకల్యంపై పకడ్బందీగా ధృవీకరణ ప్రక్రియ చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పంచాయతీ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 22 నుండి పాడేరు ప్రభుత్వ సర్వజన అసుపత్రి, అరకువ్యాలీ ఏరియా ఆసుపత్రి, రంపచోడవరం ఏరియా ఆసుపత్రులలో వికలాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించి పున మూల్యాంకన చేయాలని సూచించారు. జిల్లాలో 8582 మంది వికలాంగులు ఉన్నారని చెప్పారు. వీరికి పరీక్షలు నిర్వహించి అంగవైకల్యాన్ని నమోదు చేయాలన్నారు. 8 వైద్య బృందాలను ఏర్పాటు చేసామన్నారు. నిర్దిష్టమైన షెడ్యూలు వేసుకుని పున్నపరిశీలన పూర్తి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి జమాల్ భాషా, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరిండెంట్ విశ్వమిత్ర, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత దేవి, పర్చువల్‌గా డిసిహెచ్ ఎస్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి

కుష్టు వ్యాధి గ్రస్తులకు మెరుగైన వైద్యం

పాడేరు: కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో కుష్టు వ్యాధి నిర్మూలనా గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 20 వ తేదీ నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం జరుగుతుందన్నారు. సమగ్రమైన సర్వే చేసి కుష్టు వ్యాధితో బాధపడే వారిని గుర్తించి వైద్యం అందించాలన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, కాళ్ల చేతులు తిమ్మిర్లు కలిగి ఉండటం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించక పోవడం, తెలియకుండానే చేతులు, కాళ్ల బొబ్బలు రావడం వంటి లక్షణాలు కలిగి ఉంటారని చెప్పారు. ఆరోగ్య సిబ్బంది సర్వేకు వచ్చినపుడు సహకరించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వ్యాధి లక్షణాలు ఉంటే ఆరోగ్య కార్యకర్తలు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జామాల్ భాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

-జిల్లా రవాణా శాఖ అధికారి లీలా ప్రసాద్

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:వాహనదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా రవాణా శాఖ అధికారి లీలా ప్రసాద్ తెలిపారు.మండల కేంద్రంలో ఆకస్మికంగా సోమవారం వాహనాల తనిఖీల చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహన దారులు సకాలంలో రోడ్డు టాక్సీ, ఇన్సూరెన్స్, ఫిట్నెస్, పొల్యూషన్ వంటి వాటిని ఎప్పటికప్పుడు చెల్లించి ప్రభుత్వాన్ని సహకరించాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కేసులు తప్ప ఉన్నారు. ప్రైవేటు వాహనదారులు అధిక ప్రయాణికులతో ప్రయాణం చేయరాదని సూచించారు. ప్రయాణ సమయంలో వాహన దారులు అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. మోటార్ వాహన చట్టం 1988 ప్రకారం హెల్మెట్ ధారణ, రహదారి నియమ నిబంధనలు, ట్రాఫిక్ సిగ్నల్స్ తూచా తప్పకుండా పాటించాలన్నారు. గోల్డెన్ అవర్‌పై వివరించారు. హిట్ అండ్ రన్ కేసులలో నష్టపరిహారం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారుల సిబ్బంది, వాహన యజమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖ అధికారి లీలా ప్రసాద్


జిల్లా ఆసుపత్రిలో వెల్‌నెస్ ఓపీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి పాడేరు: రోగులపట్ల ఆదరాభిమానాలు కలిగి ఉండాలని, వారికి మెరుగైన చికిత్సలు అందించాలని స్థానిక శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచించారు. సోమవారం జిల్లా సర్వజన ఆసుపత్రిలో వెల్నెస్ ఓపి కేంద్రాన్ని, ప్రివెంటివ్ ఆంకాలజీ కేంద్రాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే గిరిజనులు అమాయకులని, వారికి పలు సందేహాలు ఉంటాయని, వారితో ప్రేమగా మాట్లాడి వారికి మెరుగైన వైద్యం అందిస్తారన్న నమ్మకాన్ని కలగజేయాలని కోరారు. రిఫరల్ ఆసుపత్రికి పంపించే సందర్భంలో కూడా వారికి అవగాహన కల్పించి పంపించాలని సూచించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

ఆసుపత్రి మెడికల్ పర్యవేక్షకురాలు విశ్వమిత్ర మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర 2047లో భాగంగా రాష్ట్రమంతా వెల్ నెస్ (స్వచ్ఛత) కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి సోమవారం, బుధవారం చికిత్సలతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కోసం కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్రెస్ట్, ఓరల్, సర్వికల్ కేన్సర్‌లను గుర్తించడానికి ప్రివెంటివ్ ఆంకాలజీ కేంద్రాన్ని కూడా ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి మంగళ, గురువారాలలో కేన్సర్ అనుమానిత రోగులు పరీక్షలు చేయించుకోవచ్చని, హొమిబాబా కేన్సర్ కేంద్రానికి రిఫర్ చేయడం జరుగుతుందని వివరించారు.. ఈ కార్యక్రమంలో ఉప పర్యవేక్షకులు టి.నరసింగరావు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అనంతగిరి మండలంలోని గుమ్మ పంచాయితీలో గుమ్మ నుండి నిమ్మఊట, మల్లెల్లు, మిర్తిదుంగడ, కాకివలస ,మద్దిగరు, కరకవలస, కరివేసు బీటీ రింగ్ రోడ్డు నిర్మాణానికి సోమవారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, అనంతగిరి ఎంపిపి శెట్టి నీలవేణి, జడ్పిటిసి దీసరి గంగరాజు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, నిరంతర ప్రజల పోరాటాలు, ప్రజాప్రతినిధుల సహకారంతో 11 కోట్లా 55 లక్షల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. రోడ్డు నాణ్యతగా నిర్మాణ పనులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుమ్మ సర్పంచ్ కెబి రాములమ్మ, వాలాసి సర్పంచ్ సన్యాసిరావు, వైసిపి నాయకులు రేగబోయిన స్వామి, శెట్టి.లక్ష్మనరావు, కృష్ణమూర్తి, కెబి గంగరాజు, సిపిఎం నాయకులు వంతల బుద్రయ్య, కందుల పూర్ణనందు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఎమ్మెల్యే అసహనం

- చింతపల్లి మండల సర్వసభ్య సమావేశం తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-చింతపల్లి

మారుమూల గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే సాధారణ సర్వసభ సమావేశం ఉద్దేశ్యమని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. సోమవారం ఎంపీపీ కోరాబు అనూష దేవి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాధారణ సర్వసభ సమావేశంలో పాల్గొన్నారు. మండల సర్వసభ సమావేశానికి మండల స్థాయి ఉన్నతాధికారులు గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇకపై మండల సర్వసభ సమావేశానికి అన్ని శాఖల మండలస్థాయి ఉన్నతాధికారులు విధిగా పూర్తి సమాచారంతో హాజరు కావాలని, కిందిస్థాయి సిబ్బందిని పంపి చేతులు దులుపుకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వారం రోజులలో ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు నవజాత శిశువులు మృతిపై స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి సూపరిండెంట్ ప్రభావతిని ప్రశ్నించగా, తనకు సంబంధం లేదని వైద్యాధికారి వివరణపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ముగ్గురు చిన్నారులు పుట్టుకతోనే చనిపోతే సంబంధం లేదని చెప్పడం సమంజసం కాదని మందలించారు. గిరిజన ప్రాంతంలో రోగులకు సేవాభావంతో, చిత్తశుద్ధితో వైద్యసేవలు అందించాల్సిన ప్రభుత్వవైద్యులు, ఇతర ఇతర యంత్రాంగం మొక్కుబడిగా చేతులు దులుపుకుంటే సహించేది లేదని మండిపడ్డారు. సమావేశానికి మధ్యలో వచ్చి, చివరి వరకు ఉండకుండా వెళ్లిపోయిన ఆసుపత్రి సూపరెంటిండెంట్ తీరును పలువురు సభ్యులు తప్పుబట్టారు. వైద్య నిపుణులు నిర్లక్ష్యం కారణంగానే నవజాత శిశువుల మృతి చెందారన్న ఆరోపణలపై చర్యలు విచారించి, చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పలువురు మండల స్థాయి అధికారులు గైర్హాజరు, వచ్చిన కొద్దిమంది తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరించిన తీరుపై అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే దీనిపై జిల్లా కలెక్టర్‌కు వివరించి, తగు చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జెడ్‌పిటిసి పోతురాజు బాలయ్య, వైస్ ఎంపిపి సాగిన వెంగళరావు, ఇఒపిఆర్‌డి ఎన్‌టి.రామారావు, పలువురు అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

వీర పాపన్నకుంట గ్రామంలోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని వీరపాపన్న కుంట గ్రామంలోని ఖాళీగా ఉన్న అంగన్వాడి, ఆశ వర్కర్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెల్లవారిగూడెం, వీర పాపన్నకుంట గ్రామ శాఖ సమావేశంలో మాట్లాడుతూ, వీర పాపన్నకుంట అనే గ్రామం ఉందనే విషయం పట్టనట్లుగా ప్రభుత్వం, అధికారులు వ్యవహారిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని సమస్యలు, ఖాళీగాఉన్న పోస్టులు భర్తీ చేయాలని మూడేళ్లుగా అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా ఎటువంటి స్పందన లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కమ్మ చిచ్చు సత్యనారాయణ, ములకనపల్లి సర్పంచ్ సవలం మారయ్య, మాజీ సర్పంచ్ తెల్లం కన్నమ్మ తెల్లం కన్నారావు, వెట్టి చంద్రావు, సోయం భద్రయ్య, మోసం శేఖర్, కారం సీతయ్య రవ్వ దసరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సీజనల్, అంటువ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అంటు వ్యాధులు, సీజనల్‌గా వచ్చే వ్యాధులు, మాదక ద్రవ్యాల అనర్థాలపై రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ కౌన్సిలర్ నారే వాసు మాట్లాడుతూ ఎప్పుడు జ్వరం వచ్చినా వెంటనే హాస్పిటల్‌కి వచ్చి చూపించుకోవాలని, లేదంటే తెల్లరక్త కణాలు లోపించి ప్రాణం పోవచ్చని చెప్పారు. మాదక ద్రవ్యాలు, గుట్కాలు, పాన్ పారాక్కులు, పొగాకు వల్ల క్యాన్సర్ వస్తుందని, అటువంటి అలవాట్లుకు దూరంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ పండా సతీష్ మాట్లాడుతూ హాస్పిటల్‌లో ఇటువంటి కార్యక్రమాలు జరగడం ద్వారా ప్రజలలో చైతన్యం వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించండి



రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీకి సమస్యలు విన్నవిస్తున్న దేవీపట్నం సర్పంచ్

ప్రజాశక్తి- దేవీపట్నం : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి, తెలుగు యువత అధ్యక్షులు లంక హరిబాబు కోరారు. సోమవారం రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయం వద్ద సబ్ కలెక్టర్ కల్పశ్రీ పలు సమస్యలతో వినతి పత్రాన్ని అందజేశారు. పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన మండలంలోని 44 గ్రామాలో పరిశీలనలో ఉన్న సుమారు 1200 అర్జీలను పరిశీలించి, వారిని అర్హులుగా గుర్తించాలని రెనానేజ గోకవరం మండలం గంగాలమ్మ తల్లి ఆలయ సమీపంలో దేవీపట్నం గ్రామానికి సంబంధించి 8.30ఎకరాల భూసమస్యను తక్షణమే పరిష్కరించి నిర్వాసితులకు గృహ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన, గిరిజనేతర భూములకు నష్టపరిహారం, పునరావాస కాలనీలో శ్మశాన వాటికలు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని కోరారు. దీనిపై సబ్‌కలెక్టర్ కల్పశ్రీ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానన్నారు కార్యక్రమంలో దేవీపట్నం, కొండమొదలు, పూడిపల్లి గ్రామాల నిర్వాసితులు ఉన్నారు

లోకేష్‌ను ఉప ముఖ్యమంత్రి చేయాలి

ప్రజాశక్తి -సీలేరు: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉపముఖ్యమంత్రిగా నియమించాలని అరకు పార్లమెంటు టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి నక్క హరిహర తిరుమలరావు కోరారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కష్టకాలంలో టిడిపి బలోపేతానికి, పార్టీ కేడర్‌లో మనోధైర్యం నింపడానికి యువగళం పాదయాత్ర ద్వారా కృషి చేసిన లోకేష్, విపక్షాలను నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా ఎదురొడ్డి నిలబడి, ఓడిన మంగళగిరిలోనే 90వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి తానేంటో నిరూపించుకున్నారన్నారు. నారా లోకేష్ కృషి, చొరవ వల్లే నేడు టిడిపి సభ్యత్వాలు కోటిని దాటాయంటేఅతిశయోక్తి కాదన్నారు. కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్న లోకేష్, ఉపముఖ్యమంత్రి పదవికి అన్ని విధాలా అర్హుడన్నారు.

మెస్ ఛార్జీల భారంపై.. ఎయు విద్యార్థుల ఆందోళన



ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న ఎయు విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర యూనివర్సిటీలో ఇటీవల కాలంలో పెంచిన మెస్ ఛార్జీలను తగ్గించాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన సోమవారం ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట విద్యార్థులు ఆందోళనకు దిగారు. వారినుద్దేశించి సంఘం ఆంధ్ర యూనివర్సిటీ కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ విచ్చలవిడిగా మెస్ ఛార్జీలు పెరగడంతో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాస్టళ్లను అభివృద్ధి చేయకుండా హాస్టల్ డెవలప్‌మెంట్ ఫండ్ పేరుతో ప్రతి ఆరు నెలలకు రూ.750, టర్మ్ ఛార్జెస్ పేరుతో రూ.400 వసూలు చేస్తున్నారని, విద్యార్థులపై కరెంట్ బిల్లుల భారం మోపుతున్నారని తెలిపారు. హాస్టల్ రూమ్‌లో ఒక ఫ్యాన్, ఒక లైటుకు రూ.350 కరెంటు బిల్లు వసూలు చేస్తున్నారన్నారు. సమస్యలపై ఇప్పటికే నాలుగుసార్లు వినతులు సమర్పించినప్పటికీ ఎయు అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇతర విశ్వవిద్యాలయాలలో గరిష్టంగా మెస్ ఛార్జీలు రూ.3 వేలు వసూలు చేస్తుంటే, ఎయులో రూ.3900 - రూ.4200 వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. తరగతులు ప్రారంభమైనా మెస్‌లను పూర్తిస్థాయిలో తెరవకపోవడంతో విద్యార్థులు బయటకు వెళ్లి తినాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి.అజయ్, పి.సాయి పాల్గొన్నారు

కమిటీ ఏర్పాటు

విద్యార్థుల ఆందోళనపై యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు స్పందించారు. సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. సమస్యల పరిష్కారంలో భాగంగా సోమవారం సాయంత్రం 9 మందితో కూడిన కమిటీని ఆయన ఏర్పాటు చేశారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి



దీక్షల్లో పాల్గొన్న అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జెఎసి నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, అది మాత్రమే శాశ్వత పరిష్కారమని విశాఖ మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు సోమవారమూ కొనసాగాయి. దీక్షల్లో వివిధ యూనియన్లకు చెందిన కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ప్యాకేజీ ప్రకటించడం హర్షించదగిన విషయమన్నారు. అయితే ఆ ప్యాకేజీతోనే సమస్య పరిష్కారం కాదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. ఉద్యోగులకు బకాయి ఉన్న జీతాలను చెల్లించాలన్నారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. దీక్షల్లో విశాఖ ఆటో రిక్షా యూనియన్ అక్కయ్యపాలెం జోన్ అధ్యక్షులు బాబ్జి, సురేష్, కామేష్, ఎఎస్ఆర్.నగర్‌కు చెందిన పి.గౌరీష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎం.అప్పారావు, ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పుడు తదితరులు పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ ప్రజా దర్బార్‌కు 21 అర్జీలు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ :విఎంఆర్‌డిఎలో ప్రవేశపెట్టిన ప్రజాదర్బార్ - ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 21 మంది అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ సమస్యలు సాధ్యమైనంత వరకు పరిష్కారయోగంగా ఉండాలని, అప్పుడే సంస్థపై ఉన్న నమ్మకం మరింతగా పెరుగుతుందని అన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ అర్జీదారు అధికారుల వల్ల పలుమార్లు సంస్థ చుట్టూ తిరగరాదన్నారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో అలసత్వం వహించరాదన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

- పిఎం జన్‌మన్ ఇళ్లకు ఆర్థిక సాయం రూ.ఐదు లక్షలకు పెంచాలి
- ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు గెమ్మెలి చిన్నబాబు



ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న జన్‌మన్ ఇళ్ల లబ్ధిదారులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పిఎం జన్‌మన్ కింద మంజూరు చేసిన ఇళ్లకు ఆర్థికసాయాన్ని రూ.5 లక్షలకు పెంచాలని, ఇల్లు లేని నిరుపేద గిరిజన కుటుంబాలకు ఈ పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు గెమ్మెలి చిన్నబాబు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ సంఘంవలస,దాబుగుడ, గ్రామంలో పర్యటించి పిఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులంతా తమకు ఇళ్ల నిర్మాణ ఆర్థిక పరిమితిని ఐదు లక్షలకు పెంచాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణానికి సంబంధించి సిమెంట్, ఇనుము, ఇతర ముడిసరుకు ధరలు భారీ పెరగడంతో ప్రస్తుతం పిఎం జన్‌మన్ పథకం కింద ఒక్కో ఇంటికి ఇస్తున్న ఆర్థికసాయం రూ.2.39లక్షలు గిరిజన ప్రాంతంలో ఎటూ సరిపోవడం లేదని, దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకం ప్రవేశపెట్టినప్పటికీ, ఇచ్చిన ఆర్థికచేయూతతో ఇళ్ల నిర్మాణాలు అరకొరగానే నిలిచి, మొండిగోడలే మిగిలిపోయే పరిస్థితి నెలకొంటుందన్నారు. లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితులు, మన్యంలో గృహనిర్మాణాలు పూర్తిచేయాలంటే ఎంత నిధులు అవసరమో స్థానిక ఎంపి, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులతోపాటు జిల్లాకలెక్టర్, ఐటిడిఎ పిఒ కేంద్ర ప్రభుత్వానికి వాస్తవ పరిస్థితులు నివేదించి, పేదల సొంతింటి కల సాకారానికి సహకరించాలని కోరారు. పిఎం జన్‌మన్ హౌసింగ్ సర్వేలో సాంకేతిక కారణాలు వలన తిరస్కరించిన పేర్లను కూడాపరిగణనలోకి తీసుకుని అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.కార్యక్రమంలో గ్రామస్తులు, లబ్ధిదారులు మూర్తి, ప్రేమ్ కుమార్, విజయ్ పాల్గొన్నారు.

ఆశ్రయం కరువు

- నిరాశ్రయులకు నగరంలో కేవలం 8 నైట్ షెల్టర్లే..!
- నిర్వహణ పట్ల జివిఎంసి నిర్లక్ష్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలో దిక్కులేని దీనులు, హీనులకు ఆశ్రయం కల్పించాల్సిన నైట్ షెల్టర్లు అతి తక్కువ ఉండటం, వాటిలో కూడా సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నిరాశ్రయులకు ఆశ్రయం లేని పరిస్థితి నెలకొంది. నగర పరిధిలో ప్రస్తుతం ఎనిమిది నైట్ షెల్టర్లు ఉండగా, వీటిని పెంచుతామని నాలుగేళ్ల క్రితం జివిఎంసి ప్రకటించింది. అయితే ఇంత వరకూ అది అమలుకు నోచుకోలేదు. 2017లో జివిఎంసి నిర్వహించిన సర్వేలో 1224 మంది నిరాశ్రయులు నగరంలో ఉన్నట్లు గుర్తించారు. సర్వే నిర్వహించేనాటికే నగరంలో ఎనిమిది నైట్ షెల్టర్లు ఉన్నాయి. ఆ తర్వాత నుంచి నేటి వరకూ సర్వే జరగలేదు. నైట్ షెల్టర్లు ఏర్పాటు చేసిన ప్రారంభంలో ఉన్న జనాభా కంటే ఇప్పుడు జనాభా ఎన్నో రెట్లు పెరిగింది. 2017లో నగర జనాభా 20 లక్షలు ఉండగా, ఇప్పుడు సుమారు 25 లక్షల మందికి చేరుతుందని అంచనా. అదే క్రమంలో నిరాశ్రయులూ పెరిగారు. వారితో పాటు ఆసుపత్రి అవసరాల కోసం నగరానికి వచ్చే వారి కోసం నీడను ఇచ్చే నైట్ షెల్టర్లు తక్కువగా ఉండటం, వాటిలో మౌలిక సదుపాయాలు లేకపోవడం, ఉన్న వాటిలో ఎక్కువగా నగరానికి దూరంగా ఉండటం తదితర కారణాలరీత్యా వాటిలోకి వెళ్లేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. అంతేగాక అవి ఎక్కడ ఉన్నాయో కూడా చాలా మందికి తెలియని పరిస్థితి.

నిబంధనలు - వాస్తవాలు

షెల్టర్లు ఏర్పడిన సందర్భంలో వాటిలో తగినన్ని పడకలు, తాగునీరు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు, స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు ఉండాలన్న నిబంధన ఉంది. వీటితోపాటు లాకర్ల సదుపాయం ఉండాలి. అయితే ఈ నిబంధనలను ప్రస్తుతమున్న నైట్ షెల్టర్లు పూర్తిస్థాయిలో పాటించటం లేదు. దీంతో నిరాశ్రయులు వీటిలో ఉండేందుకు ఇష్టపడటం లేదు. ఎముకలు కొరికే చలిలో నిత్యం అనేకమంది నిరాశ్రయులు నగరంలో ప్రస్తుతం అనేక చోట్ల కనిపిస్తున్నారు. చలిలోనే కాలం గడుపుతున్నారు. కొన్నేళ్ల క్రితం కేంద్ర బృందం నగరానికి వచ్చి, నైట్ షెల్టర్ల దుస్థితిని, నిరాశ్రయుల అవస్థలను గుర్తించి, మరోసారి నగరంలో నిరాశ్రయులపై సర్వే నిర్వహించాలని, నివేదిక పంపాలని ఆదేశించింది. జివిఎంసి అధికారులు ఆ ఆదేశాలను పెడచెవిన పెట్టారన్న విమర్శలు ఉన్నాయి.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి లక్ష మంది జనాభాకు ఒక నిరాశ్రయుల కేంద్రం (నైట్ షెల్టర్) ఉండాలి. ప్రస్తుతం నగర జనాభా 25 లక్షల వరకు ఉన్నందున 25 నైట్ షెల్టర్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎప్పటి నుంచో ఉన్న 8 షెల్టర్లనే కొనసాగిస్తున్నారు. అదనంగా 17 షెల్టర్లు ఏర్పాటు కావాల్సి ఉంది. ప్రస్తుతం నడుస్తున్న వాటిలో టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లో మహిళలు, పురుషులకు కలిపి ఒక నైట్ షెల్టర్ ఉంది. భీమ్‌నగర్‌లో పురుషులకు ఒక షెల్టర్ ఉంది. ఈ రెండు షెల్టర్లను ఎయుటిడి స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తోంది. పెదవాల్తేరు, మహారాణి పేటలో రెండు షెల్టర్లు ఉండగా, వీటిని రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహిస్తోంది. భూపేష్ నగర్‌లో ఒక షెల్టర్ ఉండగా దానిని సమిష్టి సంస్థ నిర్వహిస్తోంది. బుచ్చిరాజుపాలెంలో ఒక కేంద్రాన్ని విస్సా స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తుండగా, ఆరిలోవలో మరొక కేంద్రాన్ని ఎఎంఎస్ఎస్ సంస్థ చేపడుతోంది. టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లో నడుస్తున్న నైట్ షెల్టర్‌లో నీటి సమస్య, భీమ్ నగర్‌లో నడుస్తున్న షెల్టర్‌లో మరుగుదొడ్ల సమస్య ఉంది.

కల్యాణ మండపంలో భీమ్ నగర్ షెల్టర్

భీమ్ నగర్‌లోని నైట్ షెల్టర్ జివిఎంసికి చెందిన కల్యాణ మండపంలో కొన్నాళ్లుగా నడుస్తోంది. ఇక్కడ నుంచి నైట్ షెల్టర్‌ను తొలగించి స్థానిక పేద, మధ్య తరగతి ప్రజల వివాహాది శుభకార్యాలకు ఈ భవనం ఉపయోగపడే విధంగా చూడాలని భీమ్ నగర్ ప్రజలు కోరుతున్నారు. ఈ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఇదే సమస్యను జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ ప్రాంతంలో పర్యటించిన సందర్భంలో స్థానికులు ప్రత్యేకంగా నైట్ షెల్టర్ గురించి ఆయనకు ఫిర్యాదు చేశారు. నైట్ షెల్టర్ తొలగించి భవనాన్ని కల్యాణ మండపంగా ఉపయోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు. అందుకు ఆయన హామీ ఇచ్చినా ఆచరణకు నోచుకోలేదని స్థానికులు అంటున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తికరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆయా జిల్లాల అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టరేట్లలో జరిగింది. విశాఖలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జివిఎంసి అడిషనల్ కమిషనర్ ఎస్ఎస్.వర్మ కూడా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలన్నారు. దీంతో అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌నకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. జిల్లాలో అధికంగా 165 రీ ఓపెన్ అర్జీలు రావడం పట్ల అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీదారులతో స్వయంగా మాట్లాడి కచ్చితమైన సమాచారాన్ని అందించి, ఎటువంటి పొరపాట్లకూ తావులేని విధంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లాలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా పర్యటనను, ఈనెల 18, 19 తేదీలలో సౌత్ జోన్-2 జ్యుడీషియల్ కాన్ఫరెన్స్‌లను నిర్వహించడంలో కీలకంగా వ్యవహరించిన జిల్లా అధికారులను, సిబ్బందిని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందించారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా పడి ఐదుగురికి తీవ్రగాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ప్రజాశక్తి- చింతపల్లి : పెద్దరాయి గ్రామం నుంచి చిత్రకొండ వెళ్తున్న ఆటో బోల్తా పడి ఐదుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన గూడెం కొత్తవీధి మండలంలోని చోటు చేసుకుంది. క్షతగాత్రులు అందించిన వివరాలివి. సోమవారం ఉదయం జిమాడుగుల మండలం వంజరి పంచాయతీ, పెద్దరాయి గ్రామానికి చెందిన అల్లంగి రుతురాణి, అల్లంగి ఎస్తేరు రాణి, అల్లంగి యెహన్ బాబు, కోడా బాలమ్మ, కోడా అనాక్ రెండు కుటుంబాల సభ్యులు సొంత ఆటోలో చిత్రకొండ బంధువుల ఇంటికి వెళుతుండగా గూడెం కొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ పరిధిలోని ముల్లుమెట్ట గ్రామ సమీపంలో చింతపల్లి-గూడెం కొత్తవీధి ప్రధాన రహదారిలో ఆటో బ్రేకులు ఫెయిలై బోల్తాపడింది. డ్రైవర్ అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేక, ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో పెద్దరాయి గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు అందించిన సమాచారంతో 108 వాహన సిబ్బంది క్షతగాత్రులను చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేశారు.

అడ్డతీగలలో తాటాకిల్లు దగ్ధం



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన తాటాకిల్లు

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : అడ్డతీగల మండల కేంద్రంలో గురుకులం పాఠశాలకు వెళ్లే రహదారిలో పుడిగి మాణిక్యం చెందిన తాటాకిల్లు సోమవారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. నిరుపేద కుటుంబానికి చెందిన పుడిగి మాణిక్యం, అతని భార్య గౌరి, ముగ్గురు పిల్లలను ఇంటి వద్దే ఉంచి, రోజువారీ కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం 11గంటల సమయంలో ఇంట్లో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగడంతో, చుట్టుపక్కల వారు పిల్లలను, ఇంట్లోని కొన్ని సామాన్లును బయటకు తీసి, మంటలను ఆర్పేశారు. విషయం తెలిసి, పనిచోటు నుంచి ఇంటికి వచ్చేసరికి అంతా జరిగిపోయిందని బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. రెక్కాడితేగానీ డొక్క నిండని నిరుపేద కుటుంబానికి నిలువనీడలా ఉన్న తాటాకిల్లు దగ్ధం కావడంతో చలికాలంలో ముగ్గురు పిల్లలుతో రోడ్డున పడ్డామని భార్యాభర్తలు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ప్రమాద విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

కేలండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న వడ్డి కుల ఐక్యవేదిక నేతలు

ప్రజాశక్తి- విఆర్ పురం: మండలంలో విఆర్ పురం కెవిఆర్ మెమోరియల్ డిగ్రీ కాలేజీలో వడ్డి కుల సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు వడ్డికుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం పెద్దలు మాట్లాడుతూ త్వరలో మండల, గ్రామాల వారీగా వడ్డి కులసంఘాలను ఏర్పాటుచేసి, వడ్డి కులస్తులను ఏకతాటిపైకి తేవడంతోపాటు ఒకే వేదికగా కార్యక్రమాలను నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుల పెద్దలు వెంకటేశ్వర్లు, ముత్యాల రామారావు ముత్యాల మల్లికార్జునరావు ముత్యాల వర ప్రసాద్, పెట్ట భద్రరావు పాల్గొన్నారు

పలు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు




దుంబ్రిగుడలో డాక్టర్ రాజశ్రీ ఆధ్వర్యంలో మేకలకు డీవార్మింగ్

ప్రజాశక్తి దుంబ్రిగుడ: మండలంలోని అరకు, కురిడి పంచాయతీ గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. అరుకులో పశువైద్యశిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు.పశు వైద్యాధికారిని డాక్టర్ రాజశ్రీ ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొని మూగజీవులకు వైద్యసేవలను అందించారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఎ దివ్య, వెటర్నరీ అసిస్టెంట్ శెట్టి సుబ్బారావు, ఎహెచ్ఎలురమేష్, అనంత్, రత్నం, మహేష్, సంజీవ్, అప్పారావు, ప్రకాష్‌రాజు, జయరాజు పాల్గొన్నారు.

హుకుంపేట:మండలంలోని రంగశీల పంచాయతీ బోడిగపుట్టు గ్రామంలోనూ, బాకూరు పంచాయతీ కేంద్రంలో సోమవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. హుకుంపేట పశు వైద్యాధికారి డాక్టర్ డికె. చరణ్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది పాల్గొని, పశువులకు వ్యాక్సినేషన్,ఇతర ఆరోగ్య సేవలు అందించారు. ఈనెల 31 వరకు అన్ని గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహిస్తామని డాక్టర్ చరణ్ తెలిపారు. పశు ఆరోగ్య శిబిరాలలో పశువులు, జీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ, గర్భకోశవ్యాధులకు చికిత్సలు, ఇతర వ్యాధినిరోధక టీకాలు వేస్తామన్నారు. పశుపోషణ, శాస్త్రీయ యాజమాన్యంపై పాడిరైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా బోడిగపుట్టు, బాకూరుల్లో 348 ఆవులు, గేదెలు చిక్సితలు, 275 మేకలు,గొర్రెలకు డీవార్మింగ్ చేశారు. 32 పశువులకు గర్భకోశ చికిత్సలు, 175 పశువులకు ఇతర వైద్యసేవలు అందించినట్లు డాక్టర్ చరణ్ వెల్లడించారు. కార్యక్రమంలో చెట్టి ప్రశాంత్ పశు వైద్య సహాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: అనంతగిరి మండల కేంద్రం, ఎగువ శోభ పంచాయతీల్లో సోమవారం పశు వైద్యాధికారి డాక్టర్ బి.సందీప్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 30 పశువులకు చికిత్స అందించారు. 124 పశువులకు వ్యాధి నివారణకు మందులు అందించారు. 210 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు, 680 కోళ్లకు వ్యాక్సినేషన్ చేశారు. మూగజీవాల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎగువశోభ సర్పంచ్ కొర్ర సింహాద్రి, అనంతగిరి,బొర్రా జెవిఒ సిహెచ్ జగదీశ్వరరావు, ఎహెచ్ఎలు రవికుమార్, అనిల్‌కుమార్, సుందర్, రామ్మూర్తి పాల్గొన్నారు.



మారేడుమిల్లిలో మందులు పంపిణీ చేస్తున్న జెడ్పిటిసి బాలాజీ, డాక్టర్ వీరేంద్ర

విఆర్ పురం: మండలంలోని రేఖపల్లి గ్రామపంచాయతీ గొల్లగూడెం గ్రామంలో సోమవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని స్థానిక సర్పంచ్ పూనం సరోజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వపరంగా ఏర్పాటు చేస్తున్న పశు వైద్యశిబిరాలను పాడిరైతులు, జీవాల పెంపకందారులు వినియోగించుకోవాలని కోరారు. ఇటీవల కాలంలో వ్యాధులు ప్రబలడంతో పలు పశువులతోపాటు గొర్రెలు, మేకలు మృత్యువాత పడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ వైద్యశిబిరాల్లో మూగజీవాలకు వ్యాక్సినేషన్‌తోపాటు ఆరోగ్య సమస్యలకు చికిత్సలు, గర్భకోశ తనిఖీలు చేపట్టి మందులు అందజేస్తారన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ పశువులు, జీవాలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా తమ దృష్టికి తేవాలని కోరారు. వైద్యశిబిరంలో పశువైద్యసిబ్బంది, గొల్లగూడెం గ్రామ పెద్దలు పినబోయిన శ్రీను, నీలపాల బ్రహ్మయ్య, సరిహద్దు రాజు, మోడెం వెంకన్న బాబు, సోలా.వరహాలరావు పాల్గొన్నారు.



విఆర్.పురంలో పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సరోజిని

మారేడుమిల్లి:మారేడుమిల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కూడూరు గ్రామంలో సోమవారం పశు వైద్యాధికారి యు.వీరేంద్ర ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. 22 ఆవులు, ఎద్దులకు, 15 ఆవు దూడలకు, 155 మేకలకు బద్దె పురుగు నివారణ మందు వేశారు. కోళ్ల వ్యాధి బారిన పడకుండా మందులు పంపిణీ చేశారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గొర్లె బాలాజీ బాబు, ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, మండల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.